నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, శనివారం 23 డిసెంబర్ 2023 | BHADRADRI KOTHAGUDEM

ఉత్తమ ద్వితీయ డిపోగా సత్తుపల్లి

బహుమతులు అందిస్తున్న డీఎం రాజ్యలక్ష్మి

సత్తుపల్లి, డిసెంబర్ 22 : 2022-23 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్రంలో ఉత్తమ ద్వితీయ డిపోగా సత్తుపల్లి ఆర్టీసీ డిపో ఎంపికైంది. ఇందుకోసం వచ్చిన నగదుతోపాటు డిపోలోని ఉద్యోగులకు శుక్రవారం డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి బహుమతులు అందజేశారు. ఉత్తమ డిపోగా ఎంపికైనందుకు డిపోలోని 365 మంది ఉద్యోగులకు కేటగిరీలవారీగా బహుమతులు అందించిన అనంతరం ఆమె మాట్లాడారు. రాష్ట్రంలోనే ఉత్తమ ద్వితీయ డిపోగా సత్తుపల్లి ఎంపిక కావడం పట్ల ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. వచ్చిన నగదుతో ఉద్యోగులందరికీ బహుమతులు ఇవ్వడం సంతోషాన్నిచ్చిందన్నారు. ఇదే ఉత్సాహంతో ఉద్యోగులు పనిచేసి మరిన్ని అవార్డులు దక్కించుకోవాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ విజయశ్రీ, ఏడీసీలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అభ్యర్థులు ఖర్చుల వివరాలివ్వాలి

నోడల్ అధికారి విజయకుమారి

మాట్లాడుతున్న ఎన్నికల వ్యయ నోడల్ అధికారి విజయకుమారి

మామిళ్లగూడెం, డిసెంబర్ 22 : శాసన సభ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఎన్నికల ఫలితాలు ప్రకటించిన 30 రోజుల్లోపు తమ ఎన్నికల ఖర్చు వివరాలు అందించాలని అసెంబ్లీ ఎన్నికల వ్యయ నోడల్ అధికారి విజయకుమారి తెలిపారు. శుక్రవారం కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎన్నికల వ్యయ ఖాతాల రికన్సిలేషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల్లో పోటీ చేసిన వివిధ పార్టీల ప్రతినిధులు, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతి అభ్యర్థి ఖర్చు వివరాలను ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం సకాలంలో అందించాలన్నారు. అభ్యర్థుల బ్యాంకు ఖాతా స్టేట్‌మెంట్‌పై బ్యాంక్ మేనేజర్ ధ్రువీకరించి.. అభ్యర్థి సంతకం చేయాలని తెలిపారు. ఖర్చులకు సంబంధించిన వోచర్లపై అభ్యర్థి లేదా అభ్యర్థి ఏజెంట్ సంతకం తప్పనిసరిగా చేయాలన్నారు. ఈ నెల 29న పరిశీలకుల సమక్షంలో అభ్యర్థుల ఖర్చుల వివరాలు రికన్సిలేషన్ ఉంటుందని, దీనికి పూర్తి వివరాలతో ప్రతినిధులు హాజరుకావాలని తెలిపారు. దీనిపై ఏమైనా అభ్యంతరాలుంటే రాతపూర్వకంగా అందించాలని సూచించారు. జనవరి 2వ తేదిలోపు పూర్తిస్థాయిలో అభ్యర్థుల ఎన్నికల ఖర్చు వివరాలు, అఫిడవిట్‌ను సమర్పించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా ఆడిట్ ఉప సంచాలకులు హుస్సేన్‌నాయక్, వ్యయ పరిశీలకులు, పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవోపేతంగా ఆలయాల రామయ్యకు

- భద్రాద్రి, పర్ణశాలలో వైభవోపేతంగా తెప్పోత్సవం
- గోదావరి తీరంలో కనుల పండువగా కార్యక్రమం
- వేలాదిగా తరలి వచ్చి తిలకించిన అశేష భక్తజనం
- నేడు ఉత్తర ద్వార దర్శనం

భద్రాచలం గోదావరి నదిలో హంసవాహనంపై స్వామివారిని ఊరేగిస్తున్న దృశ్యం (ఇన్‌సెట్) రామయ్యస్వామి

భద్రాచలం/పర్ణశాల, డిసెంబర్ 22 : శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో వైకుంఠ ముక్కోటి ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి తెప్పోత్సవాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా, సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. గోదావరి తీరంలో విద్యుత్ దీపాలతో అలంకరించిన హంస వాహనంపై స్వామివారిని కొలువు తీర్చి వైభవోపేతంగా తంతు నిర్వహించారు. వేద పండితులు, అర్చకులు, వైదిక సిబ్బంది సమక్షంలో ఈ ఉత్సవాన్ని కనుల పండువగా జరిపారు. దుమ్ముగూడెం మండలం పర్ణశాలలోనూ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. భక్తుల రాకతో గోదావరి తీరం జన సంద్రమైంది.

రాజాధిరాజ వాహనంపై స్వామివారు..

తొలుత స్వామివారికి గర్భగుడిలో దర్బార్ సేవను నిర్వహించారు. ఉత్సవమూర్తులకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపారు. అనంతరం వేద పండితులు మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలు, జయజయ ధ్వానాల నడుమ, కళ్లు మిరుమిట్లు గొలిపే పటాకుల మోతల నడుమ స్వామివారిని పల్లకిలో కొలువు తీర్చి వేదిక వద్దకు తీసుకొని వచ్చారు. పుణ్యజలాలతో వేదికను సంప్రోక్షణ చేశారు. సరిగ్గా 6.01 గంటలకు హంస వాహనం జలవిహారానికి బయలుదేరింది. రామయ్య తండ్రి ఐదుసార్లు గోదావరిలో జలవిహారం చేశారు. ఆ సుందర, కమనీయ దృశ్యాన్ని చూసిన భక్తులు పరవశించిపోయారు. భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు దంపతులు, కలెక్టర్ ప్రియాంక ఆల, ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ రాంబాబు, ఆర్డీవో మంగీలాల్, మణుగూరు డీఎస్పీ రాఘవేంద్రరావు, పాల్వంచ డీఎస్పీ వెంకటేశ్ తదితరులు స్వామివారికి పూజలు చేశారు.

నేడు ఉత్తర ద్వార దర్శనం

శ్రీ సీతారామచంద్రస్వామి వారు ఆలయంలో శనివారం భక్తులకు ఉత్తర ద్వారంలో దర్శనమివ్వనున్నారు. శుక్రవారం అర్ధరాత్రి స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన, సేవాకాలం, ఆరగింపు తదితర పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు. వైకుంఠ ఏకాదశి రోజున ఉత్తర ద్వారంలో స్వామివారిని దర్శించుకున్న వారికి సకల పాపాలు తొలగిపోతాయన్నది భక్తుల ప్రగాఢ నమ్మకం. భక్త రామదాసు కాలం నుంచి వస్తున్న ఆచారం ప్రకారం వైకుంఠ ఏకాదశి రోజున తెల్లవారుజామున 3 గంటలకు అంతరాలయంలోని మూలవరులకు నిర్వహించే ప్రత్యేక అభిషేకంలో స్థానిక తహసీల్దార్ శ్రీనివాస్ దంపతులు పాల్గొంటారు.


రామయ్యను దర్శించుకున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల

పర్ణశాలలో హంసవాహనంపై రామయ్య..

లే అవుట్ల అనుమతులు పూర్తి చేయాలి

కలెక్టర్ వీపీ గౌతమ్

మాట్లాడుతున్న కలెక్టర్ వీపీ గౌతమ్

మామిళ్లగూడెం, డిసెంబర్ 22 : నిబంధనల మేరకు నిర్ణీత గడువులోగా జిల్లాలో లే అవుట్ల అనుమతులను పూర్తి చేయాలని కలెక్టర్ వీపీ గౌతమ్ అనుబంధ శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లాస్థాయి లే అవుట్ల అప్రూవల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖమ్మం నగర పాలక సంస్థ, వైరా, మధిర, సత్తుపల్లి, మున్సిపాల్టీల పరిధిలో, సుడా పరిధిలోని లే అవుట్ల ఆమోదం కోసం అందిన 23 దరఖాస్తులను పరిశీలించారు. నిబంధనల మేరకు సమర్పించిన దరఖాస్తులను కమిటీ ఆమోదించింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో లే అవుట్ల ఆమోదం కోసం రెవెన్యూ, విద్యుత్, ఇరిగేషన్, రోడ్లు, భవనాలు, టౌన్ ప్లానింగ్ తదితర అనుబంధ శాఖల నుంచి అనుమతుల కోసం సమర్పించిన దరఖాస్తులను ఆయా శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించాలన్నారు. వాటికి 21 రోజులలోపు అనుమతులు జారీ చేయాలని ఆదేశించారు. తర్వాత జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో ఆమోదం జరుగుతుందన్నారు. గ్రీనరీ కోసం కేటాయించిన స్థలాన్ని వెంటనే స్వాధీనం చేసుకొని మొక్కలు నాటాలన్నారు. లే అవుట్ల డెవలపర్స్ నిబంధనల మేరకు ప్రణాళికాబద్ధంగా ల్యాండ్ డెవలప్‌మెంట్ పనులు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఖమ్మం నగర సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, ఆర్డీవో గణేశ్, జడ్పీ సీఈవో అప్పారావు, డీపీవో హరికిషన్, పీఆర్ ఎస్ఈ చంద్రమౌళి, ఏడీ సర్వే ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాసులు, డీటీసీపీవో ప్రసాద్, టీపీవో వికాస్, సత్తుపల్లి, మధిర, వైరా మున్సిపల్ కమిషనర్లు సుజాత, రమాదేవి, కరుణాకర్‌రెడ్డి, తహసీల్దార్లు, ఇరిగేషన్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

వరుసకట్టిన 'దూది' బండ్లు

కొనుగోలు కేంద్రంలో పత్తి నిల్వలు పేరుకుపోయాయి. చేసేది లేకపోవడంతో అధికారులు మూడు రోజులపాటు కొనుగోళ్లు నిలిపివేశారు. శుక్రవారం మళ్లీ కొనుగోళ్లు ప్రారంభించడంతో మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ కొటెక్స్‌లో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రం వద్ద పత్తి లోడు వాహనాలు బారులు తీరాయి. సీసీఐ కొనుగోలు కేంద్రంలో ఎటువంటి మోసాలకు తావులేకుండా అధికారులు చర్యలు చేపట్టడం.. గిట్టుబాటు ధర కల్పిస్తుండడంతో రైతులు గంటల తరబడి వేచి ఉండి తమ పంట ఉత్పత్తులను అమ్ముకుంటున్నారు.

–కారేపల్లి, డిసెంబర్ 22

బారులు తీరిన వాహనాలు

'పరీక్ష'కు పరుగులు..

- కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా టెస్టులు
- జలుబు, దగ్గు ఉన్న వారు పరీక్షల కోసం బారులు
- జిల్లా ఆస్పత్రితోపాటు భద్రాచలంలో ఐసోలేషన్ వార్డులు

కొవిడ్ పరీక్షల కోసం ఆస్పత్రికి వచ్చిన రోగులు

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ) : కరోనా మహమ్మారి మళ్లీ విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రజల్లో ఆందోళన మొదలైంది. వైద్య, ఆరోగ్య శాఖ ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించడంతో ప్రజలు ఉరుకులు పరుగులతో టెస్ట్‌లకు పరిగెడుతున్నారు. ఈసారి వైరస్ ఎలాంటి లక్షణాలు లేకుండా వచ్చే అవకాశాలు ఉన్నాయంటూ ప్రచారం జరగడంతో ప్రజలు ఆస్పత్రి బాట పడుతున్నారు. దగ్గు, జలుబు ఉన్నా.. లక్షణాలు కనిపించినా చాలు వైద్యుల వద్దకు వెళ్లి పరీక్షలు చేయించుకుంటున్నారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం రోగులు పెద్ద ఎత్తున క్యూ కట్టి మరీ కరోనా పరీక్షలు చేయించుకున్నారు.

ఆస్పత్రిలో కరోనా పరీక్షలు షురూ..

కొత్త వేరియంట్ వస్తున్నదని వారం రోజుల నుంచి విస్తృతంగా ప్రచారం కావడంతో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఆస్పత్రుల్లో ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేసి పరీక్షల ప్రక్రియను ప్రారంభించారు. కొత్తగూడెం జిల్లా ఆస్పత్రిలో కరోనా పరీక్షల కోసం వైరాలజీ ల్యాబ్‌లో సిబ్బందిని అప్రమత్తం చేసి పరీక్షలు చేయించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

జలుబు, దగ్గు ఉన్నవారు బారులు

ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, చలి తీవ్రత నేపథ్యంలో జిల్లాలో నెల రోజుల నుంచి జ్వరాల బారినపడిన వారి సంఖ్య పెరిగింది. ఈ క్రమంలోనే కరోనా మహమ్మారి ప్రబలడంతో ప్రజలు భయపడి పరీక్షల కోసం ఆస్పత్రికి క్యూ కడుతున్నారు. జ్వరం, దగ్గు, జలుబు ఉన్నవారు ముందుగానే మాస్క్‌లు ధరించి వైద్యుల వద్దకు వెళ్లి పరీక్షలు చేయించుకుంటున్నారు. కొత్త వేరియంట్ ప్రమాదం ఎలా ఉంటుందోనని దిగులు చెందుతున్నారు. వైద్యులు మాత్రం ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటే ఎలాంటి ప్రమాదం ఉండదని చెబుతున్నారు. కాగా.. జిల్లా ఆస్పత్రితోపాటు భద్రాచలం ఆస్పత్రిలో ఐసోలేషన్ వార్డులను అందుబాటులో ఉంచారు.

సత్తుపల్లిలోని ఓ ప్రైవేటు బ్యాంక్‌లో ఘరానా మోసం

డిపాజిట్ల పేరుతో ఖాతాదారుల సొమ్ము రూ.1.50కోట్లు స్వాహా

అసిస్టెంట్ మేనేజర్ నిర్వాకం ఇదీ.. లబోదిబోమంటున్న ఖాతాదారులు

సత్తుపల్లి టౌన్, డిసెంబర్ 22: సత్తుపల్లి పట్టణంలోని ఓ ప్రైవేటు బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ ఖాతాదారులకు వడ్డీ ఆశ జూపి దొడ్డిదారిన ఏకంగా రూ.1.50 కోట్లు స్వాహా చేశాడు. ఆ సొమ్ములో బ్యాంక్ అధికారులు రూ.50 లక్షల వరకు రికవరీ చేయగలిగినప్పటికీ మిగతా రూ.కోటి కోసం ఖాతాదారులు లబోదిబోమంటున్నారు. తెలిసిన వివరాల ప్రకారం.. సత్తుపల్లి పట్టణంలోని ఓ ప్రైవేటు బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న ప్రశాంత్ అనే ఉద్యోగి బ్యాంకు పరిధిలోఎక్కువ మొత్తంలో నగదు జమ చేసిన ఖాతాదారులను చాకచక్యంగా గుర్తించాడు. వారితో సత్సంబంధాలు కొనసాగిస్తూ వస్తున్నాడు. గత ఆర్థిక సంవత్సరం చివరలో తమకు పైనుంచి టార్గెట్ ఇచ్చారని, బ్యాంక్ ఖాతాల్లోని సొమ్మును డిపాజిట్ రూపంలో చెల్లిస్తే వడ్డీతో కలిపి తిరిగి వెంటనే ఖాతాల్లో జమ చేస్తామని ఖాతాదారులను నమ్మించాడు. ఖాతాదారులు అతడి మాటలను నమ్మి కొన్ని చెక్కులు ఇచ్చారు. వాటిని ప్రశాంత్ మరో ఉద్యోగి భార్య పేరుపై ఖాతా తెరిపించి దానిలో చెక్కులు వేయించాడు. ఇలా ఆరు నెలల నుంచి కొద్దికొద్దీగా నగదు డ్రా చేయడం ప్రారంభించాడు. కొద్ది రోజుల తర్వాత ప్రశాంత్ చెప్పినవేవీ జరగకపోవడాన్ని గుర్తించారు. తాము డిపాజిట్ చేసిన సొమ్ము డ్రా కావడాన్ని నిర్ధారించుకున్నారు. ఖాతాదారులు బ్యాంక్‌కు వచ్చి నిలదీశారు. తర్వాత ప్రశాంత్ సెలవు పెట్టి వెళ్లిపోయాడు. ఇలా ప్రశాంత్ సుమారు రూ.1.50 కోట్ల వరకు సొమ్మును మళ్లించాడు. బ్యాంక్ అధికారులు ఈ విషయాన్ని గుర్తించి ప్రశాంత్ నుంచి రూ.50 లక్షల వరకు రికవరీ చేసి కొందరు ఖాతాదారులకు సొమ్ము సెటిల్ చేశారు. మిగిలిన ఖాతాదారులను బ్యాంక్‌కు రప్పించి విషయం బయటకు వస్తే బ్యాంక్ పేరు ప్రఖ్యాతలు దెబ్బతింటాయని, ఈ విషయాన్ని బయటకు వెల్లడించవద్దని, ఎలాగోలా సొమ్ము సెటిల్ చేస్తామని హామీ పత్రాలను ఇచ్చి బుజ్జగించారు. విషయం ఈ నోటా ఆ నోటా పడి ప్రస్తుతం పట్టణంలో చర్చనీయాంశమైంది. ఇంత తంతు జరుగుతున్నప్పటికీ సంబంధిత ఉద్యోగిపై బ్యాంకు ఉన్నతాధికారులు పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు చేయకపోవడం గమనార్హం. బ్రాంచ్ మేనేజర్ పోస్టును కొంత కాలం నుంచి భర్తీ చేయకపోవడంతోనే అసిస్టెంట్ మేనేజర్ ప్రశాంత్ అదనుగా భావించి మోసానికి పాల్పడినట్లు సమాచారం. డబ్బుతో ప్రశాంత్ క్రికెట్ బెట్టింగ్స్‌కు పాల్పడినట్లు, దుర్వ్యసనాలతో జల్సా చేసినట్లు తెలుస్తున్నది. ఈ విషయంపై 'నమస్తే' ఇటీవల బాధ్యతలు స్వీకరించిన బ్రాంచి మేనేజర్ నాగరాజును వివరణ కోరగా.. సొమ్ము మళ్లింపుపై తమ లీగల్ బృందం సమగ్ర విచారణ చేపడుతున్నదని, ఇప్పుడే ఎలాంటి విషయాలు వెల్లడించలేమని సమాధానమిచ్చారు.